సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 28 । జూన్ । 2025



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు

బద్వేలు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే దాసరి సుధ విమర్శించారు. -8లో



గండి ఆలయ అధికారిపై విచారణ

గండి వీరాంజనేయ స్వామి ఆలయ అధికారి వెంకట సుబ్బయ్యపై దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ శుక్రవారం విచారణ నిర్వహించారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.6/27.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.4 - 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ కడప జిల్లాలోని గవర్నమెంట్, ప్రైవేటు, ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంటర్ వృత్తి విద్యా కోర్సు(ఐవీసీ) డిప్లొమా ద్వితీయ సంవత్సరం ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో (లేటరల్ ఎంట్రీ) అడ్మిషన్ కోసం జూలై 1లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నోడల్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. పూర్తి వివరాలకు https://apsbtet.in/ivc మరియు https://sbtetap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇంటర్ వృత్తి కోర్సు(ఐవీసీ) పూర్తి చేసి డిప్లొమా ద్వితీయ సంవత్సరం(లేటరల్ ఎంట్రీ)లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ఫీజు రూ.400 చెల్లించాలని వివరించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి చర్యలు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్) పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.జ్ఞానేశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గణితం, ఉర్దూ, కామర్స్ (బధిరుల కోసం) సబ్జెక్టులకు సంబంధిత పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. కామర్స్ సబ్జెక్టుకు అదనంగా స్పెషల్ ఎడ్యుకేషన్‌లో టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం సెల్ నంబర్: 9491388277ను సంప్రదించాలని కోరారు.

బీటెక్ ఫలితాల విడుదల

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీ అనుబంధ సంస్థ ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ ఫైనల్ సెమిస్టర్ ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వైవీయూ వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఈ పరీక్షల ఫలితాలను ఆయన తన చాంబర్‌లో రిజిస్ట్రార్ పుత్తా పద్మ, ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ బి.జయరామిరెడ్డితో కలిసి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బీటెక్‌లోని ఆరు బ్రాంచ్‌లకు కలిపి 236 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 234 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇద్దరు మాత్రమే ఫెయిల్ అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ డీన్ కె.వెంకట రమణయ్య, వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.ఎస్.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో.. హాయివే!

శ్రీ వెంకటేశ్వరస్వామి పాదపద్మాల చెంత ఉన్న తిరునగరికి..శ్రీనివాసుని తొలిగడప కడప నుంచి ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం ఆమోదం లభించింది. జాతీయరహదారుల ప్రాధికారసంస్థ(ఎన్‌హెచ్‌ఐ) టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. 130 కిలోమీటర్ల దూరం రహదారి నిర్మాణం ఉంటుంది. దీనినే గ్రీన్‌ఫీల్డ్ హైవేగా కేంద్రం గుర్తించింది.



తిరునగరికి...
గ్రీన్‌ఫీల్డ్ హైవేకు గ్రీన్‌సిగ్నల్!

- కేంద్ర నుంచి అటవీ అనుమతులు
- సురక్షిత ప్రయాణానికి కడప-రేణిగుంట ఫోర్‌లైన్
- త్వరితగతిన నిర్మాణానికి 'మిథున్'కృషి
- కడప నుంచి ఒకటిన్నర గంటలో తిరుపతికి చేరుకోవచ్చు

ఎన్‌హెచ్ రోడ్డు వివరాలు..

జిల్లా	దూరం
తిరుపతి	20కి.మీ
వైఎస్సార్,అన్నమయ్య	110 కి.మీ

అంచనా వ్యయం: రూ. 2350 కోట్లు



ఫోర్‌లైన్ ఇలా...

- రేణిగుంట నుంచి కరంకబాడి, మామండూరు, బాలపల్లె, శెట్టిగుంట వరకు ఉన్నరహదారినే ఫోర్‌లైన్‌గా మార్చనున్నారు.
- రైల్వేకోడూరుకు ముందుభాగంలో బైపాస్ మార్గం ఏర్పాటు. ఇక్కడ నుంచి అయ్యపురెడ్డిపల్లె, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, భాకరపేట పడమరదిశగా ఫోర్‌లైన్ వెళ్లనుంది.

రాజంపేట: శేషాచలం అటవీ ప్రాంతంలో పచ్చటి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన ప్రయాణానికి కేంద్ర అటవీశాఖ అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దేశరాజధానిలో జరిగిన వన్యప్రాణుల జాతీయసంస్థ సమావేశంలో గ్రీన్‌ఫీల్డ్‌హైవేకు అటవీ అనుమతులు కేంద్రపరంగా ఇచ్చారు. అయితే అధికారికంగా లెటర్ కమ్యూనికేట్ కాలేదు. ఈ విషయాన్ని అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గతంలో రహదారి 31 కిలో మీటర్ల పొడవునా, వన్యప్రాణుల సంచారం అధికంగా ఉందంటూ అటవీశాఖ అనుమతులు ఇవ్వడానికి అభ్యంతరాలను తెరపైకి తీసుకొచ్చింది. దీంతో రహదారి నిర్మాణానికి బ్రేక్ పడింది. వన్యప్రాణుల సంరక్షణ జాతీయబోర్డు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అడవి జంతువులు రాకపోకలకు అనువుగా భూగర్భమార్గాలు (అండర్‌పాసులు) నిర్మించాలని సూచించారు. రహదారి నిర్మాణ ఆకృతుల్లో కొన్ని మార్పులు చేశారు. అందుకు జాతీయరహదారుల ప్రాధికారసంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) సమ్మతించడంతో అటవీశాఖ పచ్చ జెండా ఊపింది.

- కడప-రేణిగుంట రహదారిలో రాజంపేట, రైల్వేకోడూరులో బైపాస్ రహదారి నిర్మించాలని యోచిస్తున్నారు. ముంబై-చెన్నై రైలుమార్గం వెంబడి (పడమర వైపు)భాకరాపేట నుంచి చిన్నఓరంపాడు వరకు మార్గం నిర్మితం కానుంది. ఈమార్గం పూర్తిగా అటవీమార్గంలోనే కొనసాగుతుంది.

హైవే నిర్మాణానికి ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

కడప-రేణిగుంట నేషనల్ హైవే త్వరితగతిన నిర్మాణంకు వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేశారు. ఫలితంగా భూసేకరణతోపాటు, మరోవైపు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రెండేళ్లలో ఎన్‌హెచ్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నదే అభిమతంగా ఎంపీ ప్రయత్నించారు.

- ఫారెస్టుకు సంబంధించి కడప-రేణిగుంట నేషనల్ హైవేకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అనుమతులు వచ్చాయి. వైల్డ్‌లైఫ్‌కు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రాలేదు. అనుమతులు రాగానే నిర్మాణపనులు పూర్తి చేస్తారు. అటవీ శాఖ నుంచి దాదాపు 300 హెక్టార్లు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే తొమ్మిది మండలాల్లో 1,790.180 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగింది. అటవీశాఖ ఇప్పటికే డీమార్కేషన్, ఎన్యూమరేషన్ పూర్తి చేశారు.

ఒంటిమిట్ట, నందలూరు ప్రాంతాలకు స్పెషల్ కనెక్టివిటీ అవసరం

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన నందలూరు, ఒంటిమిట్ట కేంద్రాలకు ఎన్‌హెచ్ నుంచి కనెక్టివిటీ రోడ్ (సర్వీసురోడ్డు) అవసరమని పలువురు భక్తులు కేంద్రాన్ని కోరుతున్నారు. పర్యాటకపరంగా ప్రాచుర్యం పొందిన ఒంటిమిట్ట, నందలూరుకు ఎన్‌హెచ్ నుంచి ప్రత్యేకంగా సర్వీసురోడ్డు నిర్మితం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మిథున్‌రెడ్డి ఇది వరకే వైఎస్సార్‌సీపీ నేతలు కోరిన సంగతి తెలిసిందే.

- కడప-రేణిగుంట హైవేలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గం మీదుగా తిరుపతి, చెన్నై, ముంబై, హైదరాబాద్‌లకు రాకపోకలు జరుగుతున్నా యి. నిత్యం 17వేలకు పైగా వాహనాలు హైవేపై పరుగులు తీస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్‌కు హైవే కెపాసిటీ సరిపోవడంలేదు. నాలుగులైన్లరోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ తగ్గి, సర్వీసురోడ్డుగా మారునున్న రహదారిలో ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి.

రూ.4వేల కోట్ల కేటాయింపు

కడప-రేణిగుంట హైవే నిర్మాణానికి రూ.4వేల కోట్లు వివిధ పనుల రీత్యా కేటాయించింది. అయితే ప్రాజెక్టు వ్యయం మాత్రం రూ2,350 కోట్లుగా అంచనా వేశారు. గత ఏడాది జూలైలో కేంద్రమంత్రి గడ్కరీ శంకుస్థాపన చేశారు. కడప-రేణిగుంట ఫోర్‌లైన్ నిర్మాణరహదారిలో లక్ష్మీఇన్‌ఫ్రా నిర్మాణ సంస్థ పనులు చేపట్టేందుకు క్యాంప్‌లను సిద్ధం చేసుకుంటోంది.

- మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన తిరుపతికి వస్తుంటారు. కడప-రేణిగుంట రహదారి ఎన్‌హెచ్ చేయడం వల్ల వీరు సఖంగా ప్రయాణం చేయడానికి వీలు కలుగుతుంది. కడప నుంచి ఒకటిన్నరగంటలో తిరుపతికి చేరుకోవచ్చు.

అటవీ అందాలతో..



716 కడప-రేణిగుంట జాతీయరహదారి. అడవి అందాలతో ముడివేసుకున్న ప్రయాణం హాయిగా కొనసాగనుంది. రాయలసీమ జిల్లాలకు ముఖ్య రహదారి అయినందున దీనిని త్వరగా పూర్తిచేయాలని కేంద్రం యోచిస్తోంది. ఆ దిశగా కేంద్రం అనుమతులు ఇచ్చింది.

గండికోట జలాశయం పరిశీలన



గండికోట జలాశయాన్ని పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ అధికారులు

కొండాపురం: మండల పరిధిలోని గండికోట జలాశయాన్ని జిల్లా నీటి పారుదల శాఖ సీఈ పి.రామచంద్రమూర్తి, ఎస్ఈ సి.కొండారెడ్డి శుక్రవారం పరిశీలించారు. గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26.86 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 14.9 టీఎంసీల నీరు ఉందని వారు వెల్లడించారు. అనంతరం గండికోట టన్నెల్‌ను పరిశీలించారు. గండికోట జలాశయం నుంచి ఎత్తిపోతల పథకాల ద్వారా పైడిపాళెం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ తదితర ప్రాంతాలకు తరలించే కృష్ణా జలాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జీఎన్ఎస్ఎస్ మెయిన్ రెగ్యులేటర్ నుంచి వామికొండ, సర్వారాయ సాగర్‌లకు ప్రధాన కాలువ ద్వారా 250 నీటిని తరలిస్తున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమామహేశ్వర్లు, ఏఈ సుదర్శన్, దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల తనిఖీ

బ్రహ్మంగారిమఠం: మండలంలోని గురుకుల పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్, ఎస్ఎస్ఏ పీఓ నిత్యానందరాజు శుక్రవారం తనిఖీ చేశారు. తోట్లపల్లె దగ్గర ఉన్న నూతన గురుకుల పాఠశాల, బి.మఠంలోని గురుకుల, కస్తూర్బా, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను వారు పరిశీలించారు. బి.మఠానికి వచ్చిన బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్‌తో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

త్రిశంకు స్వర్గంలో భాషా పండితులు

- గ్రేడ్ 2 కేడర్ రద్దుతో ఇబ్బందులు
- డీఈవో పూల్‌లో కొనసాగుతున్న వైనం
- ఆరేళ్లలో నాలుగోసారి బదిలీ
- హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్





పదోన్నతులు కల్పించాలని కడప డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భాషా పండితులు (ఫైల్)

బద్వేలు: 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లు' సాధారణ బదిలీలు జరిగినప్పుడల్లా.. భాషా పండితులకు స్థానచలనం కలుగుతోంది. రెండేళ్లకోసారి జరిగే బదిలీల్లో భాషా పండితులే సమిధలవుతున్నారు. ఏదో ఒక చోట నాలుగైదేళ్లు కూడా ఉంచడం లేదు. కనీసం సమీప ప్రాంతాలకు కూడా బదిలీ చేయడం లేదు. మహిళలను కూడా అడవి ప్రాంతాలు, రవాణా సౌకర్యం సరిగా లేని గ్రామాలకు బదిలీ చేస్తుండటంతో.. వారు ఇబ్బంది పడుతున్నారు. ప్రకాశం జిల్లా సరిహద్దులో ఉన్న మండలం (వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలం) నుంచి చిత్తూరు జిల్లా సరిహద్దులోని (అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం) మారుమూల గ్రామానికి (దాదాపు 190 కిలోమీటర్ల దూరం) రవాణా సౌకర్యం బొత్తిగా లేని గ్రామానికి బదిలీ చేశారు. అలాగే అదే కలసపాడు మండలానికి చెందిన మరో ఉపాధ్యాయుడిని నెల్లూరు సరిహద్దు మండలమైన చిట్వేలి (160 కిలో మీటర్ల దూరం)కి బదిలీ చేశారు. పులివెందుల దగ్గర పని చేస్తున్న ఉపాధ్యాయుడిని (107 కిలోమీటర్ల దూరం) సంబేపల్లె మండలానికి బదిలీ చేశారు. అదే విధంగా ప్రొద్దుటూరు మండలానికి చెందిన మహిళా ఉపాధ్యాయురాలిని 123 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనగలూరు మండలానికి బదిలీ చేశారు. పోరుమామిళ్ల మండల మహిళా ఉపాధ్యాయురాలిని 153 కిలో మీటర్ల దూరంలో నెల్లూరు సరిహద్దున ఉన్న చిట్వేలి మండలం పోలుపల్లికి బదిలీ చేశారు. ఇలా వందల కిలో మీటర్ల దూరానికి అధిక సంఖ్యలో మహిళలను బదిలీ చేయడంతో.. వారి బాధలు వర్ణనాతీతంగా తయారయ్యాయి.

జీవో 77 తెచ్చిన తంటా

2008, 2012లలో మెగా డీఎస్సీ ద్వారా తెలుగు, హిందీ, ఉర్దూ, తమిళం, సంస్కృతం భాషల ద్వారా ఎంపికైన భాషోపాధ్యాయుల్లో ఎక్కువ మందికి గ్రేడ్-1 పండిట్లుగా పదోన్నతి లభించింది. 2019లో ప్రభుత్వం జీవో ఎంఎస్: 91 ద్వారా భాషోపాధ్యాయులందరికీ గ్రేడ్ 1 ఉన్నతీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ప్రాథమిక పాఠశాలల్లో పని చేసే సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు(ఎస్‌జీటీ)తమకు భాషో పాధ్యాయుల కేడర్ కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో చేసేదేమీ లేక అప్పటి ప్రభుత్వం జీవో ఎంఎస్ 77 ద్వారా గ్రేడ్ 2 కేడర్‌ను రద్దు చేసింది. ఫలితంగా ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో 113 మంది డీఈవో పూల్‌లోకి వెళ్లారు. అందులో 68 మంది తెలుగు భాషా పండితులు మిగిలిపోయారు. కేడర్ రద్దు చేసినప్పుడు ఆ పోస్టుల్లో ఉన్న వారందరికీ పదోన్నతి కల్పిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవని తెలిసినా అధికారులు పట్టించుకోలేదు. ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో గడిచిన ఆరేళ్లలో నాలుగు సార్లు బదిలీలకు గురయ్యారు. నిబంధనల మేరకు ఒక ఉపాధ్యాయుడు బదిలీ అయిన పాఠశాలలో ఎనిమిదేళ్లు పని చేయవచ్చు. దానికి భిన్నంగా పండిట్లను ఎప్పుడు పడితే అప్పుడు బదిలీ చేయడం పరిపాటిగా మారింది.

భాషోపాధ్యాయుల పోస్టులన్నీ మాయం

ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో తెలుగు, ఉర్దూ, సంస్కృతం, కన్నడ, తమిళం తదితర భాషా పండితులు 113 మంది ఉన్నారు. అందులో తెలుగు పండితులు 68 మంది ఉండగా, తెలుగు పండిట్ పోస్టుల ఖాళీలు 79 చూపించారు. అందులో వైఎస్సార్ కడప జిల్లాలో 11 ఖాళీలు చూపించి.. మొత్తం ఖాళీలన్నీ (68 ఖాళీలు) అన్నమయ్య జిల్లాలో చూపించారు. వైఎస్సార్ కడప జిల్లాలోని 36 మండలాల్లో 11 ఖాళీలు మాత్రమే చూపించి.. అన్నమయ్య జిల్లాలో 4 మండలాల్లో (చిట్వేలి, ఓబులవారిపల్లె, గాలి వీడు, పెనగలూరు) 39 ఖాళీలు చూపించారు. మరో 4 మండలాల్లో (టి.సుండుపల్లె, వీరబల్లి, సంబేపల్లి, రైల్వేకోడూరు) మండలాల్లో 21 ఖాళీలు చూపించారు. ఇవన్నీ కూడా వైఎస్సార్ కడప జిల్లా నుంచి 100 నుంచి 150 కిలోమీటర్ల దూరం పైమాటే. ఇలా అన్నమయ్య జిల్లాలో ఖాళీలన్నింటిలో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన దాదాపు 50 మంది భాషా పండితులతో భర్తీ చేశారు. మరి వైఎస్ఆర్ కడప జిల్లాలో భాషా పండితుల ఖాళీలు ఏమైనట్లో విద్యాశాఖాధికారులు చెప్పాల్సి ఉంది.


ప్రాథమిక పాఠశాలల్లో మిగిలిపోయిన పోస్టులు

ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఎక్కువ శాతం మంది పట్టణాలు, మండల కేంద్రాలు కోరుకోవడంతో.. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 700 ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు లేకపోతే గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు.. విద్యార్థులు రాక మూతపడే ప్రమాదం పొంచి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

సెలవుల వైపు.. చూపు


రెండేళ్లకోసారి డీఈవో పూల్ ఉపాధ్యాయులు బదిలీకి బలి అవుతున్నారు. దీంతో పిల్లల చదువులు సక్రమంగా ముందుకు సాగడం లేదు. సంసారం మొత్తం అక్కడికి మార్చడం కుదరక.. తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తమ హక్కుగా ఉన్న వివిధ రకాల సెలవులపై దృష్టి పెట్టారు. ఎక్కువ రోజులు ఇంటి దగ్గర ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే జరిగితే ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో అధిక శాతం పాఠశాలల్లో తెలుగు భాషా పండితుల కొరత ఏర్పడే పరిస్థితులు ఉత్పన్నమవుతాయని సమాచారం.

హైకోర్టు ఉత్తర్వులూ అమలు కాని వైనం



వైఎస్సార్ కడప జిల్లాలోని 113 మందితో సహా రాష్ట్రంలోని 1199 మంది భాషా పండితులు హైకోర్టును ఆశ్రయించారు. భాషా పండితుల బాధలను క్షుణంగా పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం సింగిల్ బెంచ్ గౌరవ జస్టిస్ మన్మధరావు 2024 డిసెంబర్ 20న భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని కూటమి ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. అంతేగాకుండా 2019 నుంచి భాషాపండితులకు ఇవ్వాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించి 3 నెలల గడువులో పదోన్నతులు కల్పించాలని కూడా ఆదేశించారు. హైకోర్టు ఉత్తర్వులిచ్చి ఆరు నెలలు కావస్తున్నా.. కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. హైకోర్టు ఉత్తర్వులను కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులు బేఖాతరు చేస్తూ ఖాళీలు లేవని వాయిదా వేస్తూ వచ్చారు. ప్రభుత్వం తాత్సారం చేయడంతో తమకు కూడా భాషోపాధ్యాయులుగా పదోన్నతులు కావాలని సెకండ్ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీలు) కోర్టును ఆశ్రయించారు. ఫలితంగా కోర్టు యథాస్థితిని కొనసాగించాలని ఆదేశించింది. దీంతో తమకు న్యాయం చేయాలని భాషాపండితులు మరల కోర్టుకు విన్నవించుకోగా.. జూలై 15వ తేదీకి కేసు వాయిదా ఇచ్చినట్లు సమాచారం.

న్యాయం జరుగుతుంది



జిల్లాలో డీఈవో పూల్‌లో ఉన్న భాషా పండితులకు న్యాయం జరుగుతుంది. విద్యా శాఖ కమిషనర్ కూడా వారికి జరిగిన అన్యాయాన్ని అర్థం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయ ఖాళీలు 700 వరకు ఉన్నాయి. అందులో నూతనంగా జరిగిన డీఎస్సీకి 217 ఖాళీలు భర్తీ చేస్తారు. మిగిలిన ఖాళీలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్దుబాటు చేయడం జరుగుతుంది. ఎవరికీ అన్యాయం జరగకుండా చట్ట ప్రకారం నడుచుకుంటాం.

– షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖాధికారి, కడప

పేదలకు పౌష్టికాహారం అందించేందుకు కృషి

- బాసటగా ఐఎస్‌బీ, బిల్‌గేట్స్ ఫౌండేషన్‌లు
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజల పౌష్టికాహారం మెరుగు పరిచేందుకు ఐఎస్‌బీ, బిల్‌గేట్స్ ఫౌండేషన్స్ బాసటగా నిలుస్తున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఎనాక్స్ ప్రాజెక్ట్, ఎనేబుల్ అగ్రికల్చర్ న్యూట్రిషన్ కన్వర్జెన్స్ త్రు టెక్నికల్ సపోర్ట్‌లో భాగంగా భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) భాగస్వామ్యంతో జిల్లాలో పౌష్టికాహార లోపం ఉన్న వారిని గుర్తించి పౌష్టికాహారం పెంపొందించడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం ఆన్‌లైన్ జూమ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఐఎస్‌బీ వారి ఆధ్వర్యంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలోని పౌష్టికాహార లోపంతో ఉన్న మహిళలు, పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించేందుకు ఎనాక్స్ ప్రాజెక్ట్ ద్వారా ఆకాంక్షిత జిల్లాలో భాగంగా మొదటగా చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు మండలాలలో అమలు చేసి తర్వాత జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. గ్రామీణ కుటుంబాలకు పోషక ఆహారాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి పోషక అంశాలపై భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సహకారంతో జిల్లాలో అధ్యయనం చేయనున్నారని తెలిపారు. పౌష్టికాహార, ప్రోటీన్ ఆహార పదార్థాలను కొనలేని స్థితిలో చాలా మంది ప్రజలు ఉన్నారని, వారందరికీ అందుబాటులో సరసమైన ధరల్లో పౌష్టికాహారం బహుళ రంగ మార్కెట్ల ద్వారా అందించడానికి ఈ సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు చేయాలి

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం జంగాలపల్లి గ్రామంలో ఉన్న పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మస్తాన్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉన్నాడని, ఉన్నతాధికారులు అతనిని వెంటనే సస్పెన్షన్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆ టీచర్‌పై విచారణ జరిపించాలంటూ జమ్మలమడుగు ఎంఈఓ చంద్రశేఖర్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు సుభహాన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం వాడాలి

మదనపల్లె రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనానికి వంట నిర్వాహకులు సన్నబియ్యం మాత్రమే వాడాలని, పాత బియ్యం వాడవద్దని డీఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం మదనపల్లె పర్యటనలో భాగంగా ఆయన జెడ్పీహైస్కూల్, భవిత కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పాఠశాలల్లో పాత బియ్యం నిల్వలు ఉంటే, జాయింట్ కలెక్టర్ నుంచి గైడ్‌లైన్స్ వచ్చేంతవరకు వాటిని అలాగే భద్రపరచాలన్నారు. పీఎం శ్రీ కింద మదనపల్లె జెడ్పీహైస్కూల్ భవిత కేంద్రంలో ఆటిజం సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు.

ఖాజావలి కుటుంబానికి అండగా ఉంటాం

రాయచోటి టౌన్ : భవనం పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాయపాటి ఖాజావలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అన్నమయ్య జిల్లా విద్యాసాగర్ నాయుడు అన్నారు. ఖాజావలి కడప పట్టణంలోని అశోక్ నగర్‌లో తన ఇంటిపై తన భార్యతో కలిసి తాల్పార్ పట్టకప్పే ప్రయత్నంలో ఇంటి పైకప్పు సిమెంట్ రేకులు పగిలి కిందపడ్డాడన్నారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినప్పటికీ పరిస్థితి విషమించి మృతి చెందాడన్నారు. ఆయనకు భార్య మాబున్నిసాతో పాటు నలుగురు ఆడపిల్లలు కూడా ఉన్నారని తెలిపారు. వారి కుటుంబానికి పోలీస్ శాఖ అండ ఉంటుందని చెప్పారు. అంతకు ముందుగా పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. దహన సంస్కారాల కోసం రూ.1లక్ష నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యం. శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ యం. పెద్దయ్య, అన్నమయ్య, కడప పోలీసులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ కక్ష సాధింపు

- శ్రీకాంత్‌రెడ్డి ఇల్లు కూల్చేయత్నం
- డీ-మార్కేషన్, ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే అధికారుల వీరంగం
- ఫర్నీచర్, ఇతర సామాగ్రి ధ్వంసం
- బద్వేలులో పరాకాష్ఠకు అధికార పక్షం అరాచకాలు
- ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే దాసరి సుధ

కడప సెవెన్‌రోడ్స్ : బద్వేలు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై తెలుగుదేశం పార్టీ తీవ్ర కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ఆరోపించారు. ఇందులో భాగంగా రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులను ఉసిగొల్పి వలంటీర్ వింగ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో విచారించి న్యాయం చేయాలంటూ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి వినతిపత్రాన్ని సమర్పించారు.

■ ఈ సందర్భంగా డీసీ గోవిందరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై అక్రమ కేసులు నమోదు, ఇల్లు కూల్చివేత లాంటి సంఘటలకు అధికార పక్షం పాల్పడుతోందని ఆరోపించారు. ఒక దళిత కౌన్సిలర్ బంకును ఇటీవల కూల్చివేశారన్నారు. బద్వేలు-కడప రహదారిలో చెరువు బఫర్‌జోన్‌లో నిర్మించుకున్న శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చేందుకు అధికారులు యత్నించారన్నారు. అధికారులు చెబుతున్న విధంగా ఆ ఇల్లు చెరువు పోరంబోకులో నిర్మించుకుని ఉంటే డీ-మార్కేషన్ చేసి, నోటీసులు జారీ చేసిన అనంతరమే తొలగించాలన్నారు. చట్టబద్దంగా వ్యవహరించకుండా అధికారులు రాత్రివేళ వచ్చి శ్రీకాంత్‌రెడ్డి ఇంటిలోని ఫర్నీచర్, ఏసీ, ఫ్రిజ్, ఇతర సామాగ్రిని ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ఇటీవల తమ పార్టీ పిలుపు మేరకు కడపలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి బద్వేలు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో యువతను శ్రీకాంత్‌రెడ్డి తరలించారన్న కక్షతోనే అధికార పార్టీ నేతలు ఇలాంటి అరాచకాలకు దిగారని విమర్శించారు. చెరువు పోరంబోకు స్థలంలో చాలామంది ఇళ్లు నిర్మించుకున్నారని, తొలుత వారి ఇళ్లు తొలగించకుండా వైఎస్సార్ సీపీ నాయకుని ఇంటిని తొలగించే యత్నం ఎందుకు చేశారో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉండే బద్వేలు నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా అధికార పార్టీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. జగనన్న కాలనీల్లోని భూములను ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. సుమారు 300 మంది బద్వేలు చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా ఎందుకు తొలగించరని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ స్వగ్రామమైన చెన్నకేశంపల్లెలో వైఎస్సార్ సీపీ గణనీయంగా ఓట్లు నమోదయ్యాయన్నారు. దీంతో ఆయకట్టు బంజరు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు నోటీసులు జారీ చేయించడం అన్యాయమన్నారు.

టీడీపీ అరాచకాలు ఎదుర్కొంటాం – ఎమ్మెల్యే

తమ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు పాల్పడుతున్న అరాచకాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ అన్నారు. చెరువులో నిర్మించుకున్న ఇళ్లను తొలగించకుండా శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని తొలగించేందుకు అధికారులు రావడం తగదన్నారు. కనీసం సమయం ఇవ్వకుండా రాత్రికి రాత్రే ఇంటిని తొలగిస్తామనడం దారుణమని విమర్శించారు. శ్రీకాంత్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలంగా పనిచేస్తున్నారన్న కక్షతోనే ఇంటి కూల్చివేతకు పాల్పడ్డారని ఆరోపించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఏరోజు టీడీపీ వాళ్ల ఇళ్లు కూల్చడం, ఆస్తులు స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడలేదన్నారు. బి.కోడూరు మండలంలో తమ పార్టీ సానుభూతి పరులు ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న పంటలను ధ్వంసం చేశారని ఆరోపించారు. నియోజకవర్గంలో అధికార పార్టీ చేస్తున్న అరాచకాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు.

■ బాధితుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 2017లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే తాను ఇల్లు నిర్మించుకున్నానని తెలిపారు. ఆ స్థలం సుమారు 70 సంవత్సరాలుగా తమ కుటుంబ ఆధీనంలో ఉందని తెలిపారు. ఇల్లు ఖాళీ చేయాలంటే కనీసం రెండు రోజులు సమయం ఇవ్వాలని కోరినప్పటికీ టీడీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు శుక్రవారం తెల్లవారుజామున కూడా వచ్చారని తెలిపారు. ప్రజలు అధికారం ఇచ్చింది కక్ష సాధింపులు తీర్చుకోవడానికి కాదని, సుపరిపాలన అందించేందుకు ప్రయత్నించాలని హితవు పలికారు.

■ ఈ కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు దేవిరెడ్డి ఆదిత్య, ఎస్సీ సెల్ నాయకులు వెంకటేశ్వర్లు, సీహెచ్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలోని ఏఆర్టీ కేంద్రం తనిఖీ

మదనపల్లె రూరల్ : మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రిలో ఉన్న ఏఆర్టీ, ఐసీటీసీ కేంద్రాలను జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వి. భాస్కర్ తనిఖీ చేశారు. శుక్రవారం ఏఆర్‌టీ,ఐసీటీసీ విభాగాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్‌టీ, ఐసీటీసీ ద్వారా రోగులకు మరిన్ని వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇదివరకు మదనపల్లె ప్రభుత్వాసుపత్రి ఏఆర్టీ కేంద్రాన్ని చిత్తూరు జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ విభాగం వారు తనిఖీలు చేసేవారని, ఇకపై కడప జిల్లా పరిధిలోకి ప్రభుత్వం మార్చిందన్నారు. ఆసుపత్రిలో హెచ్ఐవీ బాధితులకు అందుతున్న వైద్యసేవలు, అందుబాటులో ఉన్న మందులు, పరీక్షల కిట్లు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. కొన్ని రకాల కిట్లు కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రాన్ని వేరే భవనంలోకి మార్చడంపై సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరితో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం జిల్లా అకౌంటెంట్ ఎస్. అఫ్రోజ్, ప్రోగ్రాం అధికారి అబ్దుల్ సాదిక్, ఐసీటీసీ సిబ్బంది జయకుమార్, పుల్లయ్యానాయుడు, దీప్తి పాల్గొన్నారు.

పరుగుల సునామీ సృష్టించిన కడప జట్టు



353 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ ప్రణీల్‌రెడ్డి



114 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ సుదర్శన్



221 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మెన్ జయంత్ కృష్ణ



157 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మెన్ కెహెచ్ వీరారెడ్డి

- 353 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ ప్రణీల్‌రెడ్డి
- 765 భారీ స్కోరు చేసిన కడప జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లో రెండవ రోజు కడప జట్టు పరుగుల సునామీ సృష్టించింది. వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో కడప జట్టు గెలుపు దిశగా పయనిస్తోంది.

తొలి ఇన్నింగ్స్‌లో 401 ఓవర్‌నైట్ స్కోర్‌తో శుక్రవారం రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 175.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 765 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని ఆర్. ప్రణీల్‌రెడ్డి తన బ్యాటింగ్‌తో విజృంభించి 477 బంతుల్లో 39 ఫోర్లతో 353 భారీ పరుగులు చేశాడు. టి.సుదర్శన్ 161 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 114 పరుగులు చేశాడు, ఎస్. విష్ణు సాయి 68 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని మల్లికార్జున 2 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 7 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 14 పరుగులు చేసింది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 194 ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 77 ఓవర్లలో 524 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని ఎ. జయంత్ కృష్ణ 37 ఫోర్లు, 3 సిక్సర్లతో 221 అత్యధిక పరుగులు చేశాడు. కెహెచ్ వీరారెడ్డి 175 బంతుల్లో 157 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని తేజ 4 వికెట్లు, లోకేష్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 40 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 72 పరుగులు చేశాడు.

నకిలీ విలేకరిపై ఎస్పీకి ఫిర్యాదు



నకిలీ విలేకరి ఓబులేష్ యాదవ్ (ఫైల్)

కడప అర్బన్ : సింహాద్రిపురం, బ్రహ్మంగారిమఠం, రాజంపేట, గువ్వలచెరువు ప్రాంతాలలో టీవీ9 విలేకరి అంటూ బెదిరింపులకు దిగుతున్న పలుగురాళ్లపల్లె గ్రామానికి చెందిన ఓబులేష్ యాదవ్‌పై ఆ ఛానెల్ సిబ్బంది శుక్రవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. టీవీ9 పేరు చెప్పుకొని ఇతను చేసే వ్యవహారాలన్నీ ఉమ్మడి కడప జిల్లా సీనియర్ కరస్పాండెంట్ సుధీర్ కు సమాచారం అందడంతో ఈ విషయాన్ని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించిన ఎస్పీ బ్రహ్మంగారిమఠం పిఎస్ లో అతనిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. ఓబులేష్ యాదవ్ అనే వ్యక్తి పై ఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో టీవీ9 కడప జిల్లా సిబ్బంది సురేష్ బాబు (ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు) సురేష్ (జిల్లా కార్యవర్గ సభ్యుడు), సుబ్బారెడ్డి, కార్తీక్‌లు వున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

రామసముద్రం : రామసముద్రం మండలం దాసర్లపల్లి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రామసముద్రం బోయ వీధికి చెందిన అశోక్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం రామసముద్రం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త పట్టించుకోవడం లేదు

- ముగ్గురు పిల్లల పోషణ భారంగా మారింది
- కుమార్తెల చదువూ ఆగిపోయేలా ఉంది
- న్యాయం చేయండి అంటూ పోలీస్ స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు



కుమార్తెలతో స్వర్ణలత

జమ్మలమడుగు : 'నా భర్త జైపాల్ రెడ్డి ముగ్గురు సంతానం కలిగిన తర్వాత మమ్మల్ని వదిలిపెట్టి మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని నా బంగారు నగల్ని, ఆస్తులన్నింటినీ ఆమెకు ఇచ్చాడని.. నన్ను, నా ముగ్గురు ఆడపిల్లల్ని రోడ్డున పడేశాడు. మాకు న్యాయం చేయండి' అంటూ బాధితురాలు స్వర్ణలత ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం ఎర్రగుంట్ల పట్టణంలోని కడప రోడ్డులో తన కుమార్తెలతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. '16 సంవత్సరాల క్రితం జైపాల్‌రెడ్డితో నాకు వివాహం జరిగింది. మాకు ముగ్గురు కుమార్తెలు. గీత, పావని, ప్రసన్న. కుటుంబంలో ఎటువంటి సమస్యలు లేకపోవడంతో జీవనం ప్రశాంతంగా సాగింది. అయితే ఇటీవల కొంత కాలం నుంచి మరో మహిళతో నా భర్త అక్రమ సంబంధం పెట్టుకని తమని పట్టించుకోవడం మానేశాడు. ఇంటికి కూడా రావడంలేదు. విషయం తెలియడంతో నా భర్తను నిలదీశానని.. ఇలా పిల్లల్నివదిలిపోతే ఎలా అంటూ ప్రశ్నించాను. అయితే మీరు నాకు అవసరం లేదని.. నేను ఉంచుకున్న దాంతోనే ఉంటానని చెప్పి వెళ్లిపోయాడు. ముగ్గురు ఆడపిల్లలతో ఏం చేయాలో నాకు దిక్కుతోచడం లేదు. పిల్లల పోషణ భారం అవుతోంది. పిల్లల చదువులు ఆగిపోయే పరిస్థితి ఉంది. నా భర్త తమ కుటుంబాన్ని పోషించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.. న్యాయం చేయండి.. లేకపోతే పిల్లలతో సహా ఆత్మహత్య ఒక్కటే శరణ్యం' అంటూ స్వర్ణలత కన్నీటి పర్యంతమైమంది. ఈ మేరకు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధం

రాయచోటి : అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమని వైఎస్ఆర్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలో రవీంద్రారెడ్డి పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో అరెస్టుపై స్పందించారు. రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేరు కూడా కేసులో చేర్చడంతో పాటు 19 మందిపై కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

కారు ఢీ - వ్యవసాయ కూలి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నారాయణ

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లి పంచాయతీ, అమృతవారిపల్లి జాతీయ రహదారిపై వెనుక నుండి కారు ఢీ కొనడంతో గుండ్ల నారాయణ (40) అనే వ్యవసాయ కూలి శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పంచాయతీలోని ముక్కవారిపల్లి దళితవాడకు చెందిన గుండ్ల నారాయణ కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజూ వలే ముక్కావారిపల్లికి జాతీయ రహదారి పక్క నుండి నడుచుకుంటూ వెళ్తుండగా పోరుమామిళ్ల నుండి తిరుపతికి వెళ్తున్న కారు వేగంగా ఢీ కొనడంతో నారాయణ తలకు తీవ్రంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీ కొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారి చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలో స్కూటర్‌ను కారు ఢీ కొనడంతో ఈశ్వరయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మంగంపేట కాపుపల్లి దళితవాడ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య తన పనులు ముగించుకొని ఇంటికి మోటార్ బైక్ వెళ్తుండగా చెన్నకేశవ స్వామి గుడి మలుపువద్ద కారు ఢీ కొంది. దీంతో క్రిందపడ్డ ఈశ్వరయ్యకు తలకు తీవ్ర గాయం కావడంతోపాటు చేతికి గాయం అయ్యింది. గాయపడిన వ్యక్తిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తెలుగు తమ్ముళ్ల వాదులాట



నరసాపురంలో వాదులాడుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

కాశినాయన : మండల పరిధి నరసాపురంలోని కల్యాణ మండపంలో టీడీపీ సంస్థాగత ఎన్నికలపై కార్యకర్తల అభిప్రాయ సేకరణ సందర్భంగా శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో టీడీపీలోని రెండు వర్గాల మధ్య బాహాబాహి వాదులాట జరిగింది. 30 ఏళ్లుగా పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలకు విలువ ఇవ్వకుండా పార్టీలోకి కొత్తగా వచ్చిన డి.రవీంద్రారెడ్డిపై అధిష్టానం మొగ్గు చూపుతోంది. దీంతో మరో వర్గం వారు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలో 18 పంచాయతీలు ఉండగా 8 పంచాయతీలు రవీంద్రారెడ్డి, 10 పంచాయతీలు బంగారు గురివిరెడ్డికి అధిష్టానం అప్పజెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కార్యకర్తల సమావేశంలో టీడీపీ మండల పరిశీలకుడు ఉమాకాంత్ కార్యకర్తల అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని తెలిపారు. అయితే చిన్నాయపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మైక్ తీసుకుని టీడీపీ మండల అధ్యక్ష పదవి రవీంద్రారెడ్డికి ఇవ్వాలని చెప్పడంతో మరో వర్గం వారు అభ్యంతరం చెప్పారు. దీంతో రెండు వర్గాలు వాగ్వాదానికి దిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను పిలిపించి సర్దిచెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు బెయిల్ మంజూరు

లక్కిరెడ్డిపల్లి : టపాసుల ఘటనలో అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లిలో అక్రమంగా నమోదు చేసిన కేసులో 19 మంది వైఎస్సార్‌సీపీ నేతలకు శుక్రవా రం బెయిల్ మంజూరైంది. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డితోపాటు మరో వ్యక్తి మండ్ల సుబ్బరాయుడుకి లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అలాగే మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డితోపాటు మరో 15 మందికి శుక్రవారం హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

పంజం సుకుమార్ రెడ్డి మృతి తీరనిలోటు



నివాళులు అర్పిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



పంజం సుకుమార్ రెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజం సుకుమార్‌రెడ్డి (64) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. అనారోగ్యంతో చెన్నైలో శుక్రవారం పంజం సుకుమార్‌రెడ్డి మృతిచెందిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి.. మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి తదితరులు అనంతరాజుపేటలో పంజం మృతదేహాన్ని సందర్శించారు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 40 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా ఉన్న పంజం సుకుమార్ రెడ్డి గత ప్రభుత్వంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్‌గా, డీఆర్‌యూసీసీ సభ్యుడిగా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అనంతరాజుపేట సర్పంచ్‌గా, ప్రైవేట్‌స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పలు పదవులు చేపట్టారు. తనదైన శైలిలో వాటికి వన్నె తెచ్చారు. వైఎస్సార్ కుటుంబం వెంట నడుస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు.

ప్రముఖుల నివాళి

పంజం సుకుమార్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ రాష్ట్ర నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి, 'సాక్షి' ఎడిటర్ రక్కసి ధనుంజయరెడ్డి, మాజీఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, భూమన అభినయ్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, వత్తలూరు సాయికిశోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులురెడ్డి తదితర నాయకులు పంజం స్వగ్రామానికి చేరుకున్నారు. సుకుమార్‌రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్, సీనియర్ నాయకులు కుమార్ రెడ్డి, రామనాథంలు పంజం సుకుమార్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

నేడు అంత్యక్రియలు: వైఎస్సార్‌సీపీ నాయకులు పంజంసుకుమార్‌రెడ్డి భౌతికకాయానికి శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ఉదయం అనంతరాజుపేటకు రానున్నారు. పంజం మృతదేహానికి నివాళులు అర్పించనున్నారు.

గండి ఆలయ అధికారిపై విచారణ

- అక్రమాలను డీసీకి వివరించిన చైర్మన్, పాలకమండలి
- శ్రావణమాసంలో మూలవిరాట్ దర్శనం కల్పించకపోతే నిరాహార దీక్ష చేస్తానన్న జడ్పీటీసీ
- నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానన్న డిప్యూటీ కమిషనర్



గండి ఆలయ అధికారిపై డీసీకి రాత పూర్వక పత్రాలను అందజేస్తున్న చైర్మన్ కావలి కృష్ణతేజ

చక్రాయపేట : ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయ స్వామి ఆలయ అధికారి వెంకట సుబ్బయ్యపై శుక్రవారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్(డీసీ) పట్టెం గురుప్రసాద్ విచారణ నిర్వహించారు. వెంకట సుబ్బయ్యపై ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ రాష్ట్ర గవర్నరుకు ఫిర్యాదు చేసినందున కమిషనర్ ఆదేశాల మేరకు తాను విచారణకు వచ్చినట్లు డీసీ తెలిపారు. విచారణ సందర్భంగా డిప్యూటీ కమిషనర్.. చైర్మన్, పాలక మండలి సభ్యులను, ఆలయ అధికారిని వేరు వేరుగా విచారించారు. తొలుత చైర్మన్ పాలకమండలికి అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య బాధ్యతలను చేపట్టినప్పటి నుంచి ఇంత వరకు ఎలాంటి పాలకమండలి సమావేశాలు నిర్వహించలేదని చెప్పారు. పాలక మండలి తీర్మాణాలు లేకుండా ఆయన వెంకటస్వామి అనే వ్యక్తిని పక్కన పెట్టుకొని ఇష్టారాజ్యంగా నిధులను డ్రా చేస్తూ ఖర్చు చేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. జెండా ఆవిష్కరణ సందర్భంగా చైర్మన్‌కు, పాలక మండలికి ఆహ్వానం లేదని వెంకటస్వామి అనే వ్యక్తిచే జెండా ఆవిష్కరించారని ఫొటో చూపించి ఫిర్యాదు చేశారు. ఈనెల 26న జరిగిన షాపింగ్ గదులు, టోల్ గేట్ల టెండర్లలో ఏ అధికారం ఉందని వెంకటస్వామిని డయాస్‌పై తన పక్కనే ఏసీ ఎలా కూర్చోబెట్టుకుంటారని ప్రశ్నించారు. పైగా ప్రభుత్వం మారింది కదా.. మీరు ఇంకా పదవుల్లో ఎందుకున్నారు. రాజీనామా చేసి వెళ్లి పోండి అంటూ పాలక మండలి సభ్యులను హేళన చేస్తూ మాట్లాడుతారని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రావణ మాస ఉత్సవాలకు టెండర్లు పిలవకనే..

నిరుడు గండిలో జరిగిన శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయం తీసుకొని రు.కోట్లు ఖర్చు పెట్టాడని చెప్పారు. పాలక మండలి తీర్మాణం లేకుండా, ఎలాంటి ప్రకటనలు ఇవ్వకుండా టెండర్లు నిర్వహించకనే చలువ పందిళ్లు, క్యూలైన్లు, డెకరేషన్‌లు తదితరాలకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారని చెప్పారు. వాటి జమా ఖర్చులు పాలక మండలి అడిగితే మీకెందుకు ఇవ్వాలి అంటూ అవమానాలకు గురి చేస్తున్నాడని వారు డీసీకి ఫిర్యాదు చేశారు.

నిరాహార దీక్ష చేస్తా..

గండి వీరాంజనేయ స్వామి మూలవిరాట్ దర్శనం శ్రావణ మాసం మొదటి వారం నాటికి భక్తులకు కల్పించకపోతే నిరాహార దీక్ష చేస్తానని చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్‌కు స్పష్టం చేశారు. ఆలయ అధికారి వెంకట సుబ్బయ్య నిర్లక్ష్యం కారణంగానే ఆలయం ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు. అనంతరం ఆయన ఆలయ అధికారి వెంకట సుబ్బయ్యను కూడా పాలక మండలి చేసిన ఆరోపణలపై విచారించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు చక్రపాణి రెడ్డి, మధు, బిందు సాగర్, జయమ్మ, మునీశ్వరి, సుగుణమ్మ, వెంకటరామిరెడ్డి, కుమారి, కళావతి, మారెళ్లమడక సర్పంచ్ నరసింహులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తా ..

గండి ఆలయ అధికారి వెంకటసుబ్బయ్యపై విచారణ చేసిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని కర్నూలు దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విని రాత పూర్వకంగా తీసుకున్నానని, వీటిపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతానని చెప్పారు.